క్లుప్తంగా

ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ చైర్మన్‌గా సత్యనారాయణ

వరంగల్ చౌరస్తా: ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ చైర్మన్‌గా సీఏ పూజారి సత్యనారాయణ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా మాదరపు సుజిత్, కార్యదర్శిగా వినీల్‌రావు, కోశాధికారిగా నిఖిత, స్టూడెంట్స్ అసోసియేషన్ చైర్మన్‌గా బల్నే భగవాన్, ఎంసీ మెంబర్‌గా భరత్‌రాజ్ ఎన్నికయ్యారు.

ఎమ్మార్టీ జేఎల్‌ఎంలకు పదోన్నతి కల్పించాలి



హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ ఎమ్మార్టీ విభాగంలో పనిచేస్తున్న జూనియల్ లైన్‌మెన్లకు పదోన్నతి కల్పించాలని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు రావుల రమణారెడ్డి కోరారు. ఈమేరకు హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ అదనపు కార్యదర్శి కడెం మహేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సంగీత్‌కుమార్, హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముప్పు వేణు, నాయకులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సమ్మేళనానికి అధిక సంఖ్యలో తరలిరావాలి



హన్మకొండ కల్చరల్: ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనున్న మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఇండస్ ఫౌండేషన్ అధినేత ఏనుగుల రాకేష్‌రెడ్డి కోరారు. ఈమేరకు హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, రాజు, కార్పొరేటర్ రవినాయక్‌తో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బర్డ్ ఫ్లూపై అపోహలు వద్దు



ఖిలా వరంగల్: బర్డ్ ఫ్లూపై సోషల్ మీడియాల్లో వైరల్ అవుతున్న అపోహలను ఎవరూ నమ్మొద్దని నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. వరంగల్ రంగశాయిపేటలో వెన్‌కబ్, ఎన్‌ఈసీసీ, దివ్య చికెన్ సెంటర్ అధినేత కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం చికెన్ పకోడీ, ఉడకబెట్టిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నె రవీందర్, మండల పరశురాములు, పౌల్ట్రీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

నయీంనగర్: విద్యార్థులు కార్పొరేట్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగాల్లో రాణించాలని కాకతీయ యూనివర్సిటీ కళాశాల అభివృద్ధి మండలి డీన్ ప్రొఫెసర్ వరలక్ష్మి సూచించారు. హనుమకొండ నయీంనగర్ వాగ్దేవి కళాశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి వాణిజ్య, వ్యాపార నిర్వహణ విద్యార్థుల సమావేశం మంగళవారం పిన్నకిల్ 2కే25 ముగింపు సెషన్‌లో వరలక్ష్మి హాజరై విజేతలను ప్రశంసించారు.

నిధులు విడుదల చేయాలి

వరంగల్: గత ఏడాది నుంచి ట్రాక్టర్ నిర్వహణకు డీజిల్, ట్రాక్టర్ల రిపేర్, తాగునీటి పైపుల లీకేజీల మరమ్మతులు, గేట్ వాల్వ్, హ్యాండ్ పంపులు, మోటార్ల నిర్వహణ, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ భారంగా మారిందని వరంగల్ జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ యాకుబ్ నాయక్ వాపోయారు. ఈనెల 28లోపు గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని కలెక్టర్ సత్యశారదను కోరారు. ఈమేరకు కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంధ్యారాణి, డీపీఓ కల్పనకు వినతి పత్రాలు అందజేశారు.

గుర్తింపును రద్దుచేయాలి

విద్యారణ్యపురి: ఫీజుల పేరుతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని కళాశాలల గుర్తింపును రద్దుచేయాలని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నాయకుడు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఐఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు మాట్లాడుతూ అధిక ఫీజులు, ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలన్నారు. వినయ్, వంశీ, అజహార్, రాకేష్, కార్తీక్, రవి, శంకర్, మణిదీప్, కల్యాణ్, పృథ్వీ, వీరేష్ పాల్గొన్నారు.


మహాశివరాత్రికి సర్వం సిద్ధం



విద్యుత్ వెలుగుల్లో మెట్టుగుట్ట దేవాలయం



ఖిలా వరంగల్: ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు, క్యూలైన్లు



హసన్‌పర్తి: మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన శివాలయం



వరంగల్ చౌరస్తా: వరంగల్ స్టేషన్ రోడ్డులో సమావేశమైన ఆలయ ట్రస్టు చైర్మన్, డైరెక్టర్లు



కాజీపేట అర్బన్: కడిపికొండలో మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ఖిలా వరంగల్: మహాశివరాత్రికి నగర వ్యాప్తంగా పలు ఆలయాల్లో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యకోటలోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి.మహాశివరాత్రి ఉత్సవాలకు స్వయంభూ శంభులింగేశ్వర స్వామి దేవస్థానం విద్యుత్ దీపాల అలంకరణతో ముస్తాబైంది.

హసన్‌పర్తిలో ఆలయాల ముస్తాబు

హసన్‌పర్తి: మహాశివరాత్రి పర్వదినానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. హసన్‌పర్తి, భీమారం, వంగపహాడ్, చింతగట్టు క్యాంప్, అన్నాసాగరం, సిద్ధాపురం గ్రామాల్లోని పలు ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మహా శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

వరంగల్ చౌరస్తా: వరంగల్ స్టేషన్‌రోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాట్లను దేవాదాయ శాఖ అధికారులు, చైర్మన్, డైరెక్టర్లు మంగళవారం పరిశీలించి సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, ఈఓ కిషన్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కడిపికొండలో ఉత్సవాలు ప్రారంభం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఆలయ పూజారి జగర్లపూడి శ్రీనివాస్‌శర్మ మంగళవారం ప్రారంభించారు. గణపతి పూజ, గోపుర శిఖరానికి మహాకుంభాభిషేకం, ధ్వజస్తంభం పూజ నిర్వహించారు.

ముక్తి స్థల్‌లో శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణంలో భక్తులు

వరంగల్: వరంగల్ ఎల్బీనగర్‌లోని హిందూ ముక్తి స్థల్‌లో మంగళవారం లక్ష్మీనారాయణ, శివపార్వతుల వటవృక్ష కల్యాణ మహోత్సవం నిర్వహించారు. హిందూ ముక్తి స్థల్ కమిటీ ఆధ్వర్యంలో పద్మ బ్రాహ్మణులు గజ్జెల రాజ్‌కుమార్‌శాస్త్రి, కోడం ప్రవీణ్, రాచర్లరాజు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బూర రాంచందర్, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, సముద్రాల పరమేశ్వర్, ఉపాధ్యక్షులు పడాల నరసింగరావు, శీలం బాబురావు, గోషికొండ సుధాకర్, ఇప్ప ఆదినారాయణ, నలువల మురళి, ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, వర్కింగ్ కార్యదర్శి వంగర భాస్కర్, సహాయ కార్యదర్శులు అకెన వెంకటేశ్వర్లు, గుములపురం ఉప్పలయ్య, గాదె ప్రభాకర్, కోశాధికారి ఉప్పుల రమేష్, సహాయ కోశాధికారి అంబటి అశోక్ కుమార్, సుంకనపెల్లి శ్రీనివాస్, ప్రతాపని సుధాకర్, టీవీ.అశోక్ కుమార్, పెరుమాండ్ల సురేష్, బాకం హరిశంకర్, వంగరి సూర్యనారాయణ, బింగి మహేష్, పరమేశ్, మధు, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ తిరుమల్

- కాజీపేట ఏసీపీ తిరుమల్

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను భక్తులు ప్రశాంత వాతావరణలో నిర్వహించుకోవాలని కాజీపేట ఏసీపీ తిరుమల్ సూచించారు. ఈ సందర్భంగా వాహనాల పార్కింగ్, దర్శనాల క్యూలైన్లను మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని పోలీసు సిబ్బందికి సూచించారు. 150మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో పోలీసులకు భక్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్, కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

- హనుమకొండ డీఆర్వో వైవీ గణేశ్, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా



మాట్లాడుతున్న డీఆర్వో వైవీ గణేశ్

హన్మకొండ అర్బన్: జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని హనుమకొండ డీఆర్వో వైవీ గణేశ్, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్‌సలీమా అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించే వారిపై, వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్తు పదార్థాల నియంత్రణకు సినిమా హాళ్లలో కూడా స్లైడ్స్ వేసే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, హనుమకొండ, కాజీపేట ఏసీపీలు దేవేందర్ రెడ్డి, తిరుమల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ప్లానిటోరియం' గడువు మార్చి 20

వరంగల్ అర్బన్: వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలోని ప్లానిటోరియం నవీకరణ పనులు మార్చి 20లోగా పూర్తిచేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. ప్లానిటోరియంలో కొనసాగుతున్న సివిల్, స్విమ్మింగ్‌పూల్ పనులను మంగళవారం మేయర్ పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ప్లానిటోరియంలో ఫాల్ సీలింగ్ తోపాటు ఎలక్ట్రికల్ తదితర మిగిలిన పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, స్విమ్మింగ్‌పూల్ పనుల్లో మరింత వేగం పెంచి వేసవి ప్రారంభానికి ముందే పిల్లలకు అందుబాటులోకి తేవాలని మేయర్ సుధారాణి సూచించారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'

- సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సఖి సిబ్బంది

కాజీపేట అర్బన్: బాధిత మహిళలు, బాలికలకు సఖి కేంద్రం అండగా ఉంటోందని సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి తెలిపారు. హనుమకొండ సుబేదారిలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న మహిళలకు కౌన్సెలింగ్, వైద్య, పోలీస్, తాత్కాలిక వసతి, న్యాయ సేవలను అందజేస్తున్నట్లు వివరించారు. బాధిత మహిళలు, బాలికలు 181, 0870 - 2452112, 73829 83088 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. 24 గంటల పాటు సఖి వన్‌స్టాప్ సెంటర్ పనిచేస్తుందని అన్నారు. అనంతరం సఖి వన్‌స్టాప్ సెంటర్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

హ్యాండ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కేయూ క్యాంపస్: తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో ఈనెల 28నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్ టోర్నమెంట్‌కు హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి తెలిపారు. బీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులు వినేష్, శ్రీనివాస్ ఎంపికయ్యారని వివరించారు. ఈమేరకు వారిని కళాశాలలో మంగళవారం అభినందించారు.

ఎదకు రాకపోతే వైద్యులను సంప్రదించాలి

హసన్‌పర్తి: పశువులు ఎదకు రాకపోతే వైద్యులను సంప్రదించాలని హనుమకొండ జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ విజయ్‌భాస్కర్ సూచించారు. ఒకటో డివిజన్ పలివేల్పులలో వడ్డేపల్లి పశు వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండోమైట్రిసిస్ అనే గర్భకోశ వ్యాధి ఉంటే పశువులు త్వరగా ఎదకు రావని అన్నారు. మూడునెలల గర్భం ప్రతీసారి పోతుంటే అలాంటి పశువులను వైద్యులకు చూపించాలని పేర్కొన్నారు. వడ్డేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ బాలీజీ, డాక్టర్ రఘుబాబు, డాక్టర్ ఎస్.సీ.రెడ్డి, డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ వెంకటరాజు, సిబ్బంది రాకేష్‌రెడ్డి, వంశీ పాల్గొన్నారు.

'ఓఆర్‌ఎస్' అందుబాటులో ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

- వేసవి నుంచి రక్షణకు ఏర్పాట్లు చేయండి
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: రానున్న వేసవి దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు ప్రజలను వడగాలుల నుంచి అప్రమత్తం చేయడంతోపాటు వేసవి నుంచి రక్షణకు ఏర్పాట్లు చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై ఆయా శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆరోగ్య ఉప కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, ఉపాధి హామీ పనుల ప్రాంతాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, పరిశ్రమల వద్ద, నగరంలోని రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణ సూత్రాలను తెలిపే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. అనంతరం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వడగాలుల నుంచి సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ అప్పయ్య, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, అదనపు డీఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్, వైద్యవిధాన పరిషత్ ఆర్‌ఎంఓ బాలకృష్ణ, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అహ్మద్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, డీపీఓ లక్ష్మీరమాకాంత్, మిషన్ భగీరథ ఈఈ రామాంజనేయులు, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్, కోడిగుడ్లను ఉడకబెట్టి తినొచ్చు

- వరంగల్ కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

సాక్షి, వరంగల్: జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కానందున ప్రజలందరూ చికెన్, కోడిగుడ్లను ఉడకబెట్టి తినొచ్చని కలెక్టర్ సత్య శారద అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో మంగళవారం వరంగల్ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డీఎఫ్‌ఓ అనుజ్ అగర్వాల్‌తో కలసి కలెక్టర్ సత్యశారద బర్డ్ ఫ్లూ వ్యాధిపై వస్తున్న అపోహలు, ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లాలో 118 పౌల్ట్రీ ఫారమ్స్‌లో సుమారు 16 లక్షల కోళ్లు ఉన్నాయని, వీటిలో ఇంతవరకు బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపించలేదని పశుసంవర్ధక శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, జిల్లా వైద్యశాఖాధికారి సాంబశివరావు, అధికారులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ' పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

వరంగల్: జిల్లాలో రేపు(గురువారం) జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లను పూర్తి చేశామని కలెక్టర్ సత్యశారద తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో బ్యాలెట్ పేపర్ల పరిశీలన, పోలింగ్ సామగ్రి కేంద్రాల వారీగా వేరు చేసి పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం పోలింగ్ సిబ్బంది తుది రాండమైజేషన్ నిర్వహించి జిల్లాలోని 13 పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, ఎన్నికల పర్యవేక్షకుడు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు పన్నులు వసూలు చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: పెండింగ్‌లో ఉన్న ఆస్తి, నీటి పన్నులను నిర్ణీత గడువులోపు వసూలు చేయాలని రాష్ట్ర పురపాలక కమిషనర్ అండ్ డైరెక్టర్ (సీడీఎంఏ) డాక్టర్ టీకే శ్రీదేవి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అధికారులు పాల్గొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.117.26 కోట్ల లక్ష్యం కాగా.. ఇప్పటివరకు రూ.51.91 కోట్ల పన్నుల వసూలు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ బడా బకాయిదారులకు రెడ్ నోటీసులు చేయాలని, బల్క్ మెసేజీలు పంపించాలని, పన్నులు చెల్లించే విధంగా క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న సంస్థలు, యాజమాన్యాల వద్దకు బృందాలుగా వెళ్లి వసూలు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్నరాణి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కిలో గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్ట్

వరంగల్: శాంతినగర్ చెరువు కట్టమీద నలుగురు వ్యక్తులు మాలోదియా వెంకటేష్, ఆడెపు హరీష్, ఇందర్‌సింగ్ రాజ్ పురోహిత్, శ్రవణ్ కుమార్ రాజ్ పురోహిత్ వద్ద నుంచి సుమారు రూ.25వేల విలువైన కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. మంగళవారం ఉదయం చెరువుకట్ట మీద వెంకటేష్ గంజాయి సేవిస్తూ, అమ్ముతూ ఉండగా మిగతా ముగ్గురు 100గ్రాముల చొప్పున కొనుగోలు చేసి సేవిస్తుండగా పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు.. నలుగురి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు బైకులు, 4 మొబైల్ ఫోన్లు, రూ.17500లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.